

నేత్రపర్వంగా శూరసంహారం

- 'హరోం..హర' నినాదాలతో మార్మోగిన తిరుచెందూరు కడలితీరం
- వేడుకలకు లక్షల్లో హాజరైన భక్తజనం



శూరసంహారం కోసం శూలాయుధంతో బయలుదేరుతున్న జయంతినాథుడు



జనసంద్రంగా మారిన తిరుచెందూరు సముద్రతీరం

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవది, సముద్రతీర క్షేత్రంగా పేరొందిన తిరుచెందూరు సెంథిల్‌నాథర్ అండవర్ ఆలయానికి చేరువగా ఉన్న సముద్రతీరంలో శూరసంహార వేడుకలు గురువారం సాయంత్రం అట్టహాసంగా జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా, పొరుగురాష్ట్రాలు, దేశవిదేశాల నుంచి వచ్చిన సుమారు 6 లక్షలమంది భక్తుల నడుమ ఈ వేడుకలకు కనులపండువగా నిర్వహించారు. సర్వాలంకరణ శోభితుడై, శూరపద్ముడి (గజముఖాసురుడి)ని వధించేందుకు జయంతినాథుడు (కుమారస్వామి) సముద్రతీరానికి వేంచేశారు. సాయంత్రం నాలుగు గంటలకు జయంతినాథర్‌కు భక్తులు జేజేలు పలుకుతూ స్వాగతమిచ్చారు. తీరం పొడవునా 'హరోం హరా మురుగయ్యా' అంటూ భక్తులు నినాదాలు చేశారు. భక్తజన సముద్రం, మంగళవాయిద్యాలు, చండీ మేళాల వాయిద్యాల నడుమ జయంతినాథుడు సముద్రతీరానికి చేరుకున్నారు. ఈ శూరసంహార వేడుకలకు స్వామివారిని సిద్ధం చేసేందుకు ఒంటిగంటకే ఆలయాన్ని తెరిచారు. రాత్రి 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, వేకువజాము రెండు గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఉదయం తొమ్మిది గంటలకు ఉచ్చికాల అభిషేకం, మధ్యాహ్నం ఒంటిగంటకు దీపారాధన చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలయం నుంచి శూరపద్ముడిని సంహరించేందుకు సర్వాలంకరణ శోభితుడైన జయంతి నాథుడు తన సైన్యంతో సముద్రతీరానికి చేరుకున్నారు. ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరులిచ్చిన శూలాయుధంతో, భూత, దేవగణాలను వెంటబెట్టుకుని జయంతి నాథుడు అసురుడైన శూరపద్ముడిని వధించేందుకు కడలి తీర ప్రాంతానికి వేంచేసి తన సైన్యాధ్యక్షుడు వీరబాహుడిని రాయబారానికి పంపే ఘట్టాన్ని తొలుత ప్రదర్శించారు. ఈ శూరసంహార వేడుకల్లో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, వారి కుటుంబీకులు, జానపద కళాకారులు వేషాలు వేసుకుని సగం మంది కుమారస్వామి సైనికులుగా, సగం మంది శూరపద్ముడి కుమారులు, రాక్షసులుగా నటించారు. రాయబారానికి వెళ్ళి వీరబాహుడి వేషధారితో కుమారస్వామితో పొత్తు పొసగదని యుద్ధం తప్పదని శూరపద్ముడు తిప్పిపంపుతాడు. ఆ తర్వాత కుమారస్వామికి, శూరపద్ముడికి నడుమ భీకర సంగ్రామం కొనసాగుతుంది. ఈ భీకరమైన పోరులో శూరపద్ముడి కుమారులు బాణుగోపుడు, అగ్నిముఖాసురుడు, తమ్ముడు సింహముఖుడు తదితర సైనికులందరినీ కుమారస్వామి హతమార్చే ఘట్టాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. కడలి ఒడ్డునా, రెండు వైపులా నిలిచిన లక్షలాదిమంది భక్తుల మధ్య ఓ వైపు శూరపద్ముడి రాక్షసగణాలు దూసుకువచ్చే ఘటాన్ని, అదే విధంగా జయంతి నాథుడి సైనికులు దూసుకు వచ్చే ఘట్టాన్ని ప్రదర్శించారు. శూరపద్ముడిపై అన్ని ఆయుధాలను ప్రయోగించిన తర్వాత చిట్టచివరి ఆయుధంగా కుమారస్వామి పార్వతీపరమేశ్వరులిచ్చిన శూలాయుధాన్ని ప్రయోగిస్తారు. నిప్పులు చెరగుతూ వస్తున్న శూలాయుధాన్ని చూసి భీతిల్లిన శూరపద్ముడు మామిడి వృక్షంగా మారిపోతాడు. ఆ శూలాయుధం ఆ వృక్షాన్ని రెండుగా చీల్చుతుంది. ఓ ముక్క కోడిపుంజుగా, మరో ముక్క నెమలిగా మారుతుంది. కోడిపుంజు కుమారస్వామి పతాకం (జెండా)లో స్థానం పొందగా, నెమలి స్వామివారికి వాహనమవుతుంది. ఇలా ఆ రెండు జీవాలు స్వామివారి సేవకు అంకితం కావటంతో శూరపద్ముడికి మోక్షం ప్రాప్తించింది. ఇలా గజముఖాసురుడిని స్వామివారి శూలాయుధాన్ని ప్రయోగించే ఘట్టాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు భక్తులతో 'వీర వేల్... వెట్రివేల్.. వీరవేల్' అంటూ భక్తిపారవశ్యంతో నినాదాలు చేశారు. ఈ పౌరాణిక శూరసంహార ఘటాన్ని భక్తజనానికి ఆసక్తి కలిగించేలా తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయ నిర్వాహకులు, సిబ్బంది, జానపదకళాకారులు, స్థానిక కళాకారులు విచిత్రవేషాలు వేసి చక్కగా ప్రదర్శించారు. ఈ శూరసంహారఘట్టాన్ని తిలకించేందుకు రాష్ట్రం నుండే కాకుండా పొరుగ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ నిర్వాహకులు, పోలీసులు, స్థానిక సంస్థలు సమష్టిగా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టారు. అన్నపానీయాల వితరణ చేశారు. సుమారు నాలుగువేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ వేడుకలకు కార్లు, బస్సులు, వ్యాన్లలో విచ్చేసిన భక్తులను ఆలయానికి రెండు కిలోమీటర్ల ముందే వాహనాలను పార్కింగ్ చేయించి కాలినడకనే వేడుకల ప్రాంతానికి చేరుకునేలా ప్రత్యేకంగా క్యూలైను కూడా ఏర్పాటు చేశారు. శూర సంహారం తర్వాత జయంతి నాథుడు, వళ్ళిదేవి సమేతుడై సంతోషమండపంలో కొలువుదీరుతారు. వారిద్దరికీ ప్రత్యేక అలంకరణ చేసిన మీదట దీపారాధన నిర్వహించారు. ఆ తర్వాత జయంతి నాథుడు తన ఇష్టదేవేరులు వళ్ళి, దేవసేన సమేతంగా గిరి ప్రదక్షిణ చేసిన తర్వాత ఆలయానికి చేరుకున్నారు. శుక్రవారం స్వామి, అమ్మవార్లకు తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ వివాహవేడుకల అనంతరం, భక్తులంతా స్వామి, అమ్మవారిని దర్శించిన తర్వాత తమ స్కంధషష్టి వ్రతాన్ని ముగించనున్నారు.



ఉదయనిధికి వీణ బహుమతిగా అందజేస్తున్న ఎంపీ మురసోలి

బలంగా ఇండియా కూటమి

- విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తే గుణపాఠం తప్పదు
- ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకేను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించేవారికి ప్రజలే గుణపాఠం చెబుతారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. చీలికల పేలికలైపోయిన అన్నాడీఎంకే, రాష్ట్రంలో ఎలాంటి గుర్తింపు లేని బీజేపీ తమ కూటమిలో చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. గురువారం తంజావూరులో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ.. తాను ఉప ముఖ్యమంత్రి కావాలని తొలి గళం తంజావూరు జిల్లా నుంచే వినిపించిందని సరదాగా గుర్తు చేసుకున్నారు. నవంబరు అంటేనే వర్షా కాలమని, ఈ రోజు నేను కార్యకర్తల అభిమానవర్షంలో తడిచేందుకే తంజావూరు వచ్చానని వ్యాఖ్యానించారు. కలైంజర్ కరుణానిధి తంజావూరు నియోజకవర్గంలో విజయం సాధించారని, తంజావూరు గడ్డపై ఆయన కాలు మోపని ప్రాంతమే లేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తరచూ తాను డెల్టా వాడినని సంతోషంగా చెబుతుంటారని, ఆ బాటలోనే తాను కూడా డెల్టా వాడిని అనే గౌరవంతో ఈ వివాహాన్ని జరిపించేందుకు వచ్చానని తెలిపారు. తమిళనాడులోని ద్రావిడ మోడల్ పాలన అద్భుతంగా ఉందని పలువురు చెబుతున్నారని, నీతి ఆయోగ్ గణాంకాలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. మహిళాభివృద్ధే రాష్ట్రాభివృద్ధి అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ పలు పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలు ప్రజాదరణ పొందుతుండడంతో పలువురు ఓర్వలేకపోతున్నారని, ఎలాగైనా డీఎంకే కూటమి పార్టీల్లో చీలికలు తెచ్చేందుకు పలువురు ముందుకొస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా, డీఎంకే కూటమిలోనే తాము కొనసాగుతామని కూటమి పార్టీలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లోనూ డీఎంకే కూటమి మెజార్టీ విజయం సాధించి, అధికారం చేపడుతుందని ఉదయనిధి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం తంజావూరు లోక్‌సభ సభ్యుడి కార్యాలయాన్ని ఉదయనిధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎస్.మురసోలి ఉదయనిధికి అరుదైన తంజావూరు వీణ బహూకరించారు.

పెరుగుతున్న జ్వరాలు

- మాస్కులు ధరించండి
- ప్రజారోగ్యశాఖ ప్రకటన





చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికమవుతున్న జ్వరాలు, గొంతులో క్రిముల వ్యాప్తి పెరుగుతుడటంతో ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ప్రజారోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ సెల్వ వినాయగం సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత కొద్ది రోజులుగా జ్వరం, పడిశం, గొంతులో క్రిముల వ్యాప్తి తదితర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య అధికమవుతోందని ఆయన తెలిపారు. ఫ్లూ వైరస్ ద్వారా వ్యాప్తి చెందే ఇన్‌ఫ్లూయెంజా జ్వరాలు కూడా రాష్ట్రంలో పలు చోట్ల వ్యాప్తి చెందుతోందన్నారు. వీటికి తోడు శ్వాసకోస సమస్యలు కూడా పెరుగుతున్నాయన్నారు. దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, వంటి నొప్పి, తలనొప్పి, పడిశం, వాంతులు అధికంగా ఉంటే అలసత్వం ప్రదర్శించకుండా సమీప ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. తేలికపాటి జ్వరం, స్వల్పంగా వంటి నొప్పులు మాత్రమే ఉంటే వైద్యపరీక్షలు అనవసరమని, వారికి వైరస్ నిరోధక మాత్రలు ఇస్తే చాలని డాక్టర్ సెల్వవినాయగం పేర్కొన్నారు. పడిశం, దగ్గు, జ్వరంతో బాధపడేవారు ముఖాలకు మాస్కులు ధరించాలని, ఈ సమస్యలలు లేని 60 యేళ్లకు పైబడినవారు, ఐదేళ్లలోపు చిన్నారులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా మధుమేహం, రక్తపీడనం, గుండెనొప్పి, మూత్రాశయం, కాలేయ వ్యాధులతో బాధపడుతున్నవారు, గర్భిణులు, ఊబకాయంతో ఉన్నవారు కూడా మాస్కులు ధరించడంతోపాటు ఒసల్ టామ్‌వీర్ అనే వైరస్ నిరోధక మాత్రలు వాడాలని తెలిపారు.

అదుపులోనే డెంగ్యూ : మంత్రి సుబ్రమణ్యం

రాష్ట్రంలో డెంగ్యూ జ్వరాలు అధికమయ్యాయంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) చేసిన ఆరోపణను ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తీవ్రంగా ఖండించారు. గురువారం ఉదయం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జ్వరాల వార్డును ఆయన తనిఖీ చేశారు. ఆ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యశాఖ వైద్యుల పోస్టులను, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయడం లేదని నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్, ఈపీఎస్ పదే పదే ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీవ్‌గాంధీ స్మారక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే 4870 పోస్టులను భర్తీ చేశామని, ఇదే విధంగా ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలోనూ వైద్యుల పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ఈపీఎస్‌గానీ, ఆయన సహచరులైన మాజీ మంత్రులుగానీ ఇంతవరకూ ఏ ప్రభుత్వ ఆసుపత్రిని స్వయంగా సందర్శించకుండా ఇలాంటి అవాస్తవ ప్రకటనలు చేయడం మానుకోవాలని మంత్రి హితవు చెప్పారు.



మైలాపూరులో గొడుగులతో వెళుతున్న స్థానికులు



నందనం వద్ద మోటారుసైకిలుపై వర్షంలో తడుస్తూ వెళుతున్న జంట



అన్నాసాలైలో..

రాష్ట్రానికి వారం రోజుల వర్షసూచన

నగరంలో భారీ వర్షం

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చటం, నైరుతి బంగాళాఖాతంపై మన్నార్ జలసంధి వద్ద ఉపరితల ఆవర్తనం నెలకొనటంతో సముద్రతీర జిల్లాల్లో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రామనాథపురం, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు, విల్లుపురం జిల్లాల్లోనూ పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పలు చోట్ల ఉరుములు మెరుపులతో భారీగా, ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. నగరంలో గురువారం ఉదయం పది గంటలకు ప్రారంభమైన చిరుజల్లులు భారీ వర్షంగా మారాయి. దీంతో రాయపేట, మైలాపూరు, టీనగర్, రాయపురం, తండయార్‌పేట, తాంబరం, అంబత్తూరు, ఆవడి, పెరంబూరు, ట్రిప్లికేన్, వేళచ్చేరి, మధురవాయల్, కోయంబేడు ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షం కురిసింది. ఉత్తర చెన్నై ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరువొత్తియూరు, న్యూవాషర్‌మెన్‌పేట, కొరుక్కుపేట, మణలి, రాయపురం, కాశిమేడు ప్రాంతాల్లో గురువారం ఉదయం భారీగా వర్షాలు కురిశాయి. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం దక్షిణాది జిల్లాల్లో ఎక్కువ చోట్లా, ఉత్తరాది జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు వివరించారు. కన్నియాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి, విరుదునగర్, మదురై, శివగంగ, తూత్తుకుడి, రామనాథపురం, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై జిల్లాల్లో కొన్ని చోట్ల కుండపోతగా వర్షాలు కురుస్తాయి, ఈ నెల 13 వరకు రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

అసెంబ్లీ పోరుకు ముందే 'స్థానికం'?

- సన్నాహాల్లో ఎన్నికల సంఘం

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలతో 27 జిల్లాల్లోని స్థానిక సంస్థల పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో, అసెంబ్లీ ఎన్నికలకు ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 2019లో పంచాయతి, యూనియన్ పంచాయతి, జిల్లా పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. వార్డు పునర్విభజన కారణంగా కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, కళ్లకుర్చి, వేలూరు, తిరుపత్తూర్, రాణిపేట, తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాలు మినహా 27 జిల్లాల్లోని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. అనంతరం 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అధికారం కైవసం చేసుకుంది. అనంతరం కాంచీపురం, చెంగల్పట్టు సహా 9 జిల్లాల్లో వార్డుల పునర్విభజన పనులు వేగవంతంగా పూర్తిచేసి 2021 సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రెండు విడతలుగా స్థానిక ఎన్నికలు నిర్వహించారు.

ముందస్తు ఎన్నికలా...

2019లో ఎన్నికలు జరిగిన స్థానిక సంస్థల నిర్ణీతకాలం డిసెంబరుతో ముగియనుంది. అందువల్ల గడువు ముగియనున్న 27 జిల్లాల స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తారా? మిగిలిన 9 జిల్లాల స్థానిక సంస్థలను రద్దు చేసి, అన్ని జిల్లాల్లో ఒకేసారి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తారా? అనే విషయమై కొన్ని నెలలుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం గణాంకాల ప్రకారం, 2019 డిసెంబరులో నిర్వహించిన స్థానిక సంస్థలకు ఈ ఏడాది (2024) డిసెంబరులో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అలాగే, 2021 సెప్టెంబరు, అక్టోబరులో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలకు 2026 సెప్టెంబరులో ఎన్నికలు జరపాల్సి ఉంది. అదే సమయంలో 2026లో అసెంబ్లీ ఎన్నికలు వస్తుండడంతో, అంతకు ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఆ ఫలితాలు అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపుతాయా అనే దానిపైనా చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహించే నిర్ణయం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది.



కోయంబేడులోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం

విజయ్ ప్రభావముంటుందా?

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికార డీఎంకే పలు కోణాల్లో పరిశీలిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాలా? లేక నిర్ణీత కాలం ముగియనున్న 27 జిల్లాల స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదావేసి, ప్రత్యేక అధికారులతో 6 నెలలు పాలన విధించాలా అన్న అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నడుమ స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. డీఎంకే, అన్నాడీఎంకే మధ్య కొత్తగా నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) కూడా స్థానిక ఎన్నికల్లో పోటీచేయవచ్చు. తమ లక్ష్యం 2026 అసెంబ్లీ ఎన్నికలేనని విజయ్ ప్రకటించినప్పటికీ.. స్థానికంలోనూ ఆయన 'ట్రయల్' వేయవచ్చని డీఎంకే అనుమానిస్తోంది. ఒకవేళ విజయ్ ప్రభావంతో స్థానికంలో తమ కూటమి డీలా పడితే అది అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముందని డీఎంకే సందేహిస్తోంది.

అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం...

స్థానిక ఎన్నికల జయాపజయాలు 2026 అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనున్నాయి. అదే సమయంలో అన్ని జిల్లాలకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే విషయంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం.అలాగే, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, పరిశీలించే ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం వేగవంతం చేసింది. ఒకవేళ 27 జిల్లాలకు స్థానిక ఎన్నికలు నిర్వహించని పక్షంలో ప్రత్యేక అధికారులను నియమించే చట్ట నిబంధన వచ్చే డిసెంబరులో జరుగనున్న శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టి అమలుచేసే అవకాశముందని సచివాలయ వర్గాల సమాచారం.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీనగర్, వ్యాసర్పాడి మండల పరిధిలో శుక్రవాం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. టీనగర్ పరిధిలో వళ్లువర్‌కోట్టం సమీపంలోని 110 కేవీ.ఉపవిద్యుత్ కేంద్రం, వ్యాసర్పాడి పరిధిలో రామలింగర్ ఆలయం ఎదురుగా ఉన్న 110/33 కే.వీఉప విద్యుత్ కేంద్రంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఈ శిబిరాలు జరుగనున్నాయి. ఈ శిబిరంలో వినియోగదారులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

బీఎడ్ ప్రత్యేక కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న బీఈడీ ప్రత్యేక విద్యా కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు. తమిళం, ఇంగ్లీషు, గణితం, సైన్స్, సోషనల్, కంప్యూటర్ సైన్స్, బిజినెస్, ఎకనామిక్స్ పాఠ్యాంశాలలో 4 సెమిస్టర్లతో 2 సంవత్సరాలు, 5 సెమిస్టర్లతో 2.5 సంవత్సరాల కోర్సులు అందిస్తున్నారు. తమిళం, ఆంగ్లంలో విద్యా బోధన నిర్వహించనున్నారు. ఈ కోర్సులకు ప్రవేశ పరీక్ష డిసెంబరు 15వ తేది జరుగనుంది. ఆసక్తి కలిగిన వారు డిసెంబరు 1వ తేదిలోపు www.tnou.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షా ఫలితాలు, కటాఫ్ మార్కుల వివరాలు డిసెంబరు 23న విడుదల కానున్నాయి.మరిన్ని వివరాలకు 044-24306617 అనే నెంబరు సంప్రదించవచ్చు.

21 నుంచి బీచ్ వాలీబాల్ పోటీలు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 21 నుంచి అంతర్జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలు జరుగనున్నాయి. స్థానిక ఈసీఆర్ సమీపంలోని బీచ్ రిసార్ట్‌లో 21 నుంచి 24వ తేది వరకు జరుగనున్న పోటీల్లో 40 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

పరిశోధన, ఆవిష్కరణలకు రూ.14 కోట్లు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా తమిళనాడు ఏఐ డైరెక్టరేట్‌కు రూ.14 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 రాష్ట్ర బడ్జెట్‌లో... విద్య, ఉపాధి, పారిశ్రామిక, పరిశోధన, వైద్య విభాగాల్లో కృత్రిమ మేథస్సు పరిజ్ఞానం వినియోగించడాన్ని ప్రోత్సహించేలా 'తమిళనాడు ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ ఇన్నివేటివ్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఐదేళ్లలో ఏఐ టెక్నాలజీలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేలా పరిశోధన, ఆవిష్కరణలకు రూ.14కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

రేపు రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో రేషన్ గ్రీవెన్స్ శనివారం (9వ తేది) జరుగనుంది. నిత్యావసరాల సరఫరా, వినియోగదారుల భద్రత శాఖ ఆధ్వర్యంలో 19 మండల కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగనున్న ఈ శిబిరంలో... రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్పు, తొలగింపు, చిరునామా మార్పు, సెల్‌ఫోన్ నెంబరు నమోదు సహా రేషన్ దుకాణాల్లో అందించే సరుకుల నాణ్యత సహా ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

రూ.7,700 కోట్ల పంట రుణాలు పంపిణీ

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో సహకార బ్యాంకుల ద్వారా అక్టోబరు వరకు రైతులకు రూ.7,700 కోట్ల పంట రుణాలు అందజేశారు. సహకార బ్యాంకులు, సహకార రుణ సంఘాలు సహా అన్ని విభాగాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.1.03 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. వాటిలో రూ.57,563 కోట్ల నగల రుణాలు, రూ.16,500 పంట రుణాలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు రూ.25,000 కోట్ల నగలరుణాలు అందజేయగా, రూ.7,700 కోట్లు పంట రుణాలు అందజేసినట్లు, ఆ ప్రకారం ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు అన్ని రుణాలు కలిపి రూ.47,000 కోట్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఆదంబాక్కం: ఆదంబాక్కం, బృందావన్ నగర్ మెయిన్ రోడ్డు, ఏరికరై వీధి, న్యూ సెక్రటరియేట్ కాలని, న్యూ ఎన్జీఓ కాలని, రామకృష్ణన్ నగర్, వేల్ నగర్ కొంత భాగం, రాధా నగర్ కొంత భాగం, ఎల్‌హెచ్ నగర్ కొంత భాగం. **ఇంజంబాక్కం:** గుడుమియాండి తోపు స్కూల్ వీధి, ఖాయిదేమిల్లత్ వీధి, వేలునాయకర్ వీధి, ఆదిత్యరామ్ నగర్, ఎన్నారై లే ఔట్ (వీజీపీ వెస్ట్ అవెన్యూ), జె.నగర్ (సెమ్మొళి వీధి), పనయూర్‌కుప్పం, సీ షోర్ టౌన్ 1 నుంచి 13 అవెన్యూలు, సముద్ర వీధి (రాజాజీ వీధి).

సమరయోధుల గ్రీవెన్స్

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఖాయిదేమిల్లత్ స్మారక హాలులో గురువారం స్వాతంత్ర్య సమరయోధుల గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి సమరయోధులు, వారి కుటుంబ సభ్యులు అందజేసిన వినతిపత్రాలు స్వీకరించి, వాటిని పరిశీలించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, ప్రత్యేక సబ్ కలెక్టర్ కలియమూర్తి, వేలూరు తహసీల్దార్ బాలసుబ్రహ్మన్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ సహాయాల పంపిణి

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 'ముఖ్యమంత్రి పథక శిబిరం' జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అలాగే, కాట్పాడి నియోకవర్గంలో 798 మంది లబ్ధిదారులకు వివిధ శాఖల ఆధ్వర్యంలో రూ.10.91 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది సేర్కాడులో కళాశాల ప్రారంభించామని, అలాగే, సేర్కాడులో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటుచేయనున్నామన్నారు. కాట్పాడి-చిత్తూరు రైల్వే వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో రెండో వంతెన నిర్మించనున్నామన్నారు. కాట్పాడి నుంచి వేలూరుకు బ్రహ్మపురంలో వంతెన నిర్మించనున్నామని, ఈ రెండు వంతెనలకు రూ.100 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, కాట్పాడి పంచాయతి యూనియన్ అధ్యక్షుడు వేల్‌మురుగన్, వేలూరు కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్ కుమార్, కార్పొరేటర్లు పుష్పలత, శరవణన్, కలైవాణి, సుజాత, వేలూరు సబ్ కలెక్టర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సహాయాలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

● కొడనాడు హత్య, దోపిడీ కేసు..

ఈపీఎస్‌కు రూ.1.10 కోట్ల నష్టపరిహారం చెల్లించండి

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కొడనాడు హత్య, దోపిడీ కేసులో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి సంబంధాలున్నాయంటూ విమర్శించిన ధనపాల్ అనే వ్యక్తిని పళనిస్వామికి పరిహారంగా రూ.1.10కోట్లు చెల్లించాలని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది. కొడనాడు హత్య, దోపిడీ కేసులో నేరారోపణలు ఎదుర్కొంటూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కనకరాజ్ సోదరుడు ధనపాల్, కొడనాడు ఘటనలో మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి సంబంధాలున్నాయని ఆరోపించారు. ప్రమాదంలో మృతి చెందిన కనకరాజ్ మాజీ ముఖ్యమంత్రి జయలలిత కారు డ్రైవర్‌గా పనిచేసాడు. ఈ నేపథ్యంలో, కొడనాడు కేసులో తనకు సంబంధాలున్నాయంటూ ధనపాల్ మాట్లాడడంపై స్టే విధించాలని, తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా మాట్లాడిన ధనపాల్, తనకు రూ.1.10 కోట్ల పరిహారం చెల్లించేలా ఉత్తర్వులివ్వాలని పళనిస్వామి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ గురువారం న్యాయమూర్తి ఆర్ ఎండీ టీకారామన్ విచారించారు. కొడనాడు హత్య, దోపిడీ కేసులో పిటిషనర్ ఎడప్పాడి పళనిస్వామికి ధనపాల్ రూ.1.10 కోట్ల పరిహారం అందించాలని ఉత్తర్వులు జారీచేయడంతో పాటు ఈ కేసులో పళనిస్వామి గురించి మాట్లాడకూడదని ధనపాల్‌కు నిషేధం విధించారు.

బాలికపై అత్యాచారం

ప్రియుడి అరెస్టు ● సహకరించిన అక్క కూడా

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో ప్రేమ, పెళ్లి అంటూ మాయమాటలు చెప్పి ప్లస్‌టూ విద్యార్థినిపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో ప్రియుడి సహ అతనికి సహకరించిన అక్కను కూడా పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... మార్తాండం ప్రాంతానికి చెందిన 16 యేళ్ళ యువతి హాస్టల్‌లో ఉంటూ ప్లస్‌టూ చదువుతోంది. ఈ బాలికకు ఐటీఐ చదివే యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది.. ఈ విషయాన్ని ఆ యువకుడు తన అక్కకు చెప్పాడు. పైగా దీపావళి సెలవులకు తన ప్రియురాలిని ఇంటికి తీసుకుని రావాలని కోరాడు. దీంతో యువకుడి అక్క హాస్టల్‌కు వెళ్ళి బాలిక పిన్నమ్మగా పరిచయం చేసుకుంది. బాలిక కూడా ఆమెను తమ పిన్నిగానే హాస్టల్ వార్డెన్‌కు తెలిపింది. వారి మాటలు నమ్మిన హాస్టల్ సిబ్బంది బాలికను దీపావళి సెలవులకు ఆమెతో ఇంటికి పంపించారు. బాలికను తన తమ్ముడు వద్దకు చేర్చిన ఆ మహిళ తన ఇంటికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆ బాలికపై రాహుల్ ఐదు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీపావళి సెలవుల తర్వాత బాలిక హాస్టల్‌కు రాకపోవడంతో అనుమానించిన హాస్టల్ వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టి ఆ యువకుడి ఇంటికి వెళ్ళి బాలికను గుర్తించారు. బాలికను విచారించగా లైంగికదాడి జరిగినట్టు వెల్లడించడంతో యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చి హాస్టల్ నుంచి బాలికను ఇంటికి తీసుకెళ్ళినందుకు ఆ యువకుడు అక్కపై కూడా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అధికారంలో వాటా పేరుతో పార్టీలకు గాలం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలో వాటా పేరుతో నటుడు విజయ్ వేస్తున్న వ్యూహాలు ఫలించవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ తెలిపారు. మదురైలో గురువారం పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... కొత్తపార్టీలు ప్రారంభించడంలో ఎలాంటి తప్పులేదన్నారు. గతంలో కూడా కొత్త పార్టీ ప్రారంభించిన వారి సభలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చిన దాఖలాలున్నాయన్నారు.కొత్తపార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు వినడానికి ప్రజలు వస్తుంటారన్నారు. సహజంగానే విజయ్ నటుడు కావడంతో ఆయన అభిమానులు రావడం సహజమేనన్నారు. తాను పార్టీ ఎందుకుపెట్టాల్సి వచ్చిందో చెప్పలేని విజయ్, తాము అధికారంలోకి వస్తే కూటమి పార్టీలకు వాటా ఇస్తామని పేర్కొనడం సరికాదన్నారు. పదవుల కోసమే పార్టీలున్నాయంటూ విజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. అలా చెప్పడం ద్వారా కూటములు విచ్ఛిన్నమవుతాయని ఆయన గ్రహిస్తున్నట్లున్నారన్నారు. మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా ఏర్పడిన కూటమి ఎట్టి పరిస్థితుల్లోను ఇతరులు వేసే గాలానికి దొరకవని రామకృష్ణన్ స్పష్టం చేశారు.

టాస్మాక్ దుకాణాల్లో కంప్యూటర్ బిల్లులు

● సబర్బన్ ప్రాంతాల్లో అమలు

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రెండు వారాల్లో కంప్యూటర్ బిల్లింగ్ విధానం అమలు పరచనున్నారు. ఈ మేరకు టాస్మాక్ సంస్థ అధికారులు ప్రకటించారు. టాస్మాక్ దుకాణాల్లో నిర్ణీత ధరలకంటే రూ.10లు ఎక్కువగా మద్యం విక్రయిస్తున్నట్లు పదే పదే ఫిర్యాదులు వస్తున్నాయి.. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు అధికం కావటంతో టాస్మక్ అధికారులు మద్యం దుకాణాల్లో అమ్మకాలను డిజిజలైజేషన్ చేయడానికి సిద్ధమయ్యారు. ఆ మేరకు అన్ని దుకాణాల్లో రోజువారీ అమ్మకాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించారు. దాని ద్వారా అరక్కోణం, రామనాథపురం ప్రాంతాల్లోన్ని 14 టాస్మాక్ మద్యం దుకాణాల్లో చేతిలో ఇమిడే పరికరం ద్వారా బిల్లు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టి పరిశీలించారు. ఆ బిల్లింగ్ పద్ధతిలో స్వల్ప లోపాలుండడంతో సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. ప్రస్తుతం అరకోణం, రామనాథపురం ప్రాంతాల్లోని 110 టాస్మాక్ దుకాణాల్లో కంప్యూటర్ బిల్లింగ్ అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు వారాల్లో రాజధాని నగరం, సబర్బన్ ప్రాంతాల్లో ఈ కొత్త రకం కంప్యూటర్ బిల్లింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. డిసెంబర్ లోగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4829 మద్యం దుకాణాల్లో కంప్యూటర్ బిల్లింగ్ అమలు చేయడంతో పాటు బార్‌కోడ్ స్కేనర్ సదుపాయం కూడా కల్పించనున్నట్లు టాస్మాక్ సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు.

రేపు తిరువాన్మియూరులో మెగా వైద్య శిబిరం

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీ రామచంద్ర హాస్పిటల్ వైద్య శిబిరాన్ని నిర్వహించనుంది. తిరువాన్మియూరులోని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటరులో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారు. ఇందులో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, చెస్ట్, టీబీ మెడిసిన్, డెర్మటాలజీ, ఆప్తమాలజీ, డెంటల్ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. వీటితో పాటు ఈసీజీ, మమోగ్రామ్, ఎకో తదితర పరీక్షలను ఉచితంగా చేయనున్నారు. ఈ వైద్య శిబిరానికి హాజరుకావాలని భావించే వారు తమ పాత మెడికల్ రిపోర్టులను తీసుకుని రావాలని ఎస్ఆర్ఎంసీ ప్రజా సంబంధాల అధికారి టీజీ నల్లముత్తు విడుదల చేసిన ఒకప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఎస్ఆర్ఎంసీ వైద్యకాలేజీ, రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ కె.బాలాజీని 98410 44913లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీకి పీఎంకే ఫిర్యాదు

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో వన్నియర్ సంఘ అధ్యక్షుడు అరుల్‌మొళికి హత్యా బెదిరింపు చేసిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ పీఎంకే నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు, వన్నియర్ సంఘ నేతలు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయం వద్ద పీఎంకే నేతలు, కార్యకర్తలు

పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం వేలూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయా పాఠశాలల్లో గత పబ్లిక్ పరీక్షల్లో సాధించిన ఉత్తీర్ణతా శాతం, ఈ విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు హజరవుతున్న విద్యార్థుల వివరాలు, వారికి అందిస్తున్న విద్యాబోధన తదితరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, జిల్లా విద్యాధికారులు మహాలింగం, ప్రైవేటు పాఠశాలల అధికారి రమేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

అరియలూరు జిల్లాల్లో షూ ఫ్యాక్టరీ

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అరియలూరు జిల్లాలో రూ.1,000 కోట్లతో ఏర్పాటుకానున్న షూ ఫ్యాక్టరీ నిర్మాణాలకు ఈ నెల 15వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ భూమి పూజ చేయనున్నారు. ప్రపంచంలోనే పాదరక్షల తయారీలో పేరుగాంచిన తైవాన్‌కు చెందిన 'డీన్ షూస్' సంస్థ రూ.1,000 కోట్లతో జయంకొండాం సమీపంలోని మహిమాయి పురంలో 130 ఎకరాల్లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేయనుంది. డీన్ షూస్ గ్రూప్ అనుబంధ సంస్థ ఫ్రీ ట్రెండ్ ఇండస్ట్రియల్ ఇండియా ఈ ప్లాంట్ ఏర్పాటుచేయనుంది. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో 15,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కాగా, పెరంబలూరు జిల్లాలో ఫీనిక్స్ కొఠారి సంస్థ పాదరక్షల తయారీ కర్మాగారం ఏర్పాటుచేయగా, భవిష్యత్తులో పాదరక్షల తయారీలో రాష్ట్రం ప్రత్యేక కేంద్రంగా మారనుందని అధికారులు పేర్కొంటున్నారు.

నటుడు పార్తిబన్ ఆఫీసులో బంగారం చోరీ

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దర్శక నిర్మాత, నటుడు పార్తిబన్ కార్యాలయంలో 12 సవర్ల బంగారం చోరీకి గురైంది. ఈ కేసులో ఆయన కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని పోలీసులు విచారణ జరుపుతున్నారు. నందనం ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో పార్తిబన్ కార్యాలయం ఉండగా, ఇందులో ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ కార్యాలయంలోని తన గదిలోని లాకర్‌లో 12 సవర్ల బంగారు నగలను పార్తిబన్ భద్రపరిచారు. ఈ క్రమంలో ఈ నగలు కనిపించకుండా పోవడంతో సైదాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఆఫీసులో పనిచేసే ఆరుగురు సిబ్బందిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా పార్తిబన్ పీఏ కృష్ణకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అన్నాడీఎంకేలో క్షేత్ర అధ్యయన కమిటీ

వేళచ్చేరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో క్షేత్ర అధ్యయన కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ నిర్వాహణకు ఏర్పాటుచేసిన జిల్లాల్లోని శాఖ, వార్డు కమిటీలు, అనుబంధ సంఘాలను నేరుగా కలిసి వారితో చర్చించి పార్టీ పనులు వేగవంతం చేసేలా నివేదిక అందిస్తుందన్నారు. ఈ కమిటీ సభ్యులుగా మాజీ మంత్రులు కేపీ మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, నత్తం విశ్వనాధన్, పి.తంగమణి, ఎస్పీ వేలుమణి, జయకుమార్, సీవీ షణ్ముగం, ఎస్.సెమ్మలై, పి.వలర్మతి, వరకూర్ ఎ.అరుణాచలం తదితరులుంటారని, ఈ కమిటీ తన నివేదికను డిసెంబరు 7వ తేది పార్టీ అధిష్ఠానానికి అందించాలని ఆదేశించినట్లు ఈపీఎస్ తెలిపారు.

సికింద్రాబాద్-విల్లుపురం మధ్య ప్రత్యేక రైళ్లు

వేళచ్చేరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్-విల్లుపురం-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.07601 సికింద్రాబాద్-విల్లుపురం ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ఈ నెల 7,14 తేదీల్లో రాత్రి 7.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.05 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07602 విల్లుపురం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 8,15 తేదీల్లో విల్లుపురంలో సాయంత్రం 4.05 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు ఒంగోలు, కావలి, నెల్లూరు, రేణిగుంట, కాట్పాడి, తిరువణ్ణామలై మీదుగా విల్లుపురం చేరుకుంటాయి.

చార్మినార్‌కు అదనపు జనరల్ బోగీలు..

నెం.12750 హైదరాబాద్-తాంబరం మధ్య నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు రెండు స్లీపర్ క్లాస్ బోగీలు, నెం.12759 తాంబరం-హైదరాబాద్ మధ్య నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా రెండు జనరల్ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఈ నెల 11 నుంచి 30వ తేది వరకు ఈ బోగీలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

తరగతి గదిలో గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా ఆందియూర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. బర్గూర్ కొండ ప్రాంతంలోని సుండాపూర్ పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఆంతోని జొరాల్డ్ (49) పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఆయన తరగతులు ముగించుకొని మధ్యాహ్న భోజనం చేశారు. మధ్యాహ్నం పాఠాలు బోధించేందుకు తరగతి గదిలోకి వెళ్లిన ఆయన కుర్చీలో కూర్చుంటూ హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయారు. దిగ్భ్రాంతి చెందిన విద్యార్థులు కేకలు వేయడంతో అక్కడకు చేరుకున్న సహచర ఉపాధ్యాయులు అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అక్కడకు చేరుకున్న అంబులెన్స్‌లోని వైద్య సిబ్బంది, అతడిని పరిశీలించి గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై బర్గూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఉపాధ్యాయుడు ఆంతోని జొరాల్డ్ మృతికి పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆంతోని జొరాల్డ్ (ఫైల్‌ఫొటో)

గొంతుకోసుకుని యువకుడి ఆత్మహత్య

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై మానసిక సమస్యతో బాధపడే ఇంజనీరింగ్ పట్టభద్రుడు కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విల్లుపురం జిల్లా దిండివనంకు చెందిన రాజశేఖర్ (28) ఇంజనీరింగ్ పూర్తి చేసి, కొంతకాలం చెన్నైలోని ఓ కంపెనీలో పని చేస్తూ, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పని మానేసి డీ అడిక్షన్ సెంటరులో చేరాడు. ఆ కేంద్రం నుంచి ఇంటికి వెళ్ళిన రాజశేఖర్... తనకు వివాహం చేయాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేయసాగాడు. రాజశేఖర్ అనారోగ్య సమస్య తెలుసుకుని పిల్లనిచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో విరక్తి చెందిన రాజశేఖర్ బుధవారం రాత్రి తమ ఇంటిలోనే కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా

● అన్నదమ్ముల అరెస్టు

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముగప్పేరులో కాలేజీ విద్యార్థులకు, యువతకు డ్రగ్స్, మాదకద్రవ్యాల సరఫరా కేసులో అన్నదమ్ములను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మత్తు మాత్రలు, గంజాయి ప్యాకెట్లు, మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని మన్నడి ప్రాంతానికి చెందిన మహ్మద్ గౌస్ (41), ఈయన సోదరుడు జైనుల్లాబుద్దీన్ (35)లుగా గుర్తించారు. వీరిద్దరి ఉన్న డ్రగ్స్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మందవేలి ప్రాంతానికి చెందిన బాలాజీ (20), గూండువాంజేరికి చెందిన వర్షల్ (21), ఎంఎం నగర్‌కు చెందిన హారుణి (20), త్రిసన్ సంపత్ (20) అనే వారికి కోసం గాలిస్తున్నారు. వీరంతా కలిసి ముగప్పేరులోని ఒక ప్రైవేటు కాలేజీ విద్యార్థులకు మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నట్టు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించగా, స్థానిక జేజే నగర్ పోలీసులు కాలేజీలో నిఘా వేసి ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

పుళల్ జైలు వద్ద గంజాయి స్వాధీనం

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో ఖైదీలను కలుసుకొనేందుకు వెళ్లిన వారు దాచిన గంజాయి, సిగిరెట్ ప్యాకెట్లు, బీడి కట్టలను జైలు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అలాగే, జైలులోకి విసిరేసిన పొట్లాం నుంచి కూడా మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనల్లో 66 గ్రాముల గంజాయి. 10 సిగిరెట్ ప్యాకెట్లు, 2 బీడీ కట్టలను స్వాధీనం చేసుకున్నారు. జైలు అధికారుల ఫిర్యాదుతో ఇద్దరు ఖైదీలు సహా 10 మందిపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి రాకెట్ లాంచర్ లభ్యం

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా అంద నల్లూర్ వడతీర్థనాథాలయం సమీపంలోని కావేరి ఘాట్‌లో గత నెల 30వ తేది 60 మీ పొడవున్న రాకెట్ లాంఛర్ లభ్యమైంది. సమాచారం అందుకున్న ఆర్మీ అధికారులు అక్కడకు వెళ్లి కందకం తవ్వి రాకెట్ లాంఛర్ పేల్చి నిర్వీర్యం చేశారు. ఈ విషయమై ఆర్మీ అధికారుల వివరాల మేరకు, ఈ లాంఛర్ 1953లో కొరియా యుద్ధంలో రాకెట్ లాంఛర్ వెపన్ 'పసుకా' ఉపయోగించిన షెల్స్ డమ్మీ అన్నారు. ఈ పసుకా రాకెట్ లాంఛర్ ఆయుధాల ఫిరంగి, ట్యాంకులపై దాడి చేయడం, ధ్వంసం చేసేందుకు వినియోగిస్తారని తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధంలో వినియోగించిన ఈ రాకెట్ లాంఛర్ ఇక్కడకు ఎలా వచ్చిందనే కోణంలో విచారణ చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.



లభ్యమైన రాకెట్ లాంఛర్

వ్యభిచారం కేసులో మహిళ అరెస్ట్

వేళచ్చేరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేకే నగర్ ప్రాంతంలో వ్యభిచారం చేస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. వెస్ట్ కేకే నగర్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం సాగుతున్నట్లు కేకే నగర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో, బుధవారం రాత్రి పోలీసులు ఆ ఇంట్లో ఆకస్మికతనిఖీలు జరిపి తంజావూరు జిల్లా కుంభకోణం తిరునాగేశ్వరం మేలమేట్టు వీధికి చెందిన రాజేశ్వరిని అరెస్ట్ చేశారు. అక్కడ వ్యభిచార వృత్తిలో ఉన్న మహిళను ప్రభుత్వ హోంకు తరలించారు.

మన్నడిలో మెత్తాంపెటామిన్ స్వాధీనం

● మహిళ సహా ఐదుగురి అరెస్ట్

వేళచ్చేరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మన్నడి ప్రాంతంలో మెత్తాంపెటామిన్ అనే మాదకద్రవ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఒక మహిళ సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ప్లినేట్ పోలీసులు బుధవారం మధ్యాహ్నం మన్నడి జోన్స్ వీధిలో వాహనతనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రెండు ద్విచక్రవాహనాల్లో వచ్చిన వారిని ఆపి విచారించగా, పొంతన లేని సమాధానాలిచ్చారు. దీంతో పోలీసులు వారి బ్యాగులు తనిఖీ చేసి 7 గ్రాముల మెత్తాంపెటామిన్ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో కొడుంగైయూర్ అంబేడ్కర్ వీధికి చెందిన దినేష్‌ప్రతాప్, తండయార్‌పేట వీఓసీ నగర్‌కు చెందిన సంతోష్, పుళల్ లక్ష్మి అమ్మన్ ఆలయ వీధికి చెందిన ప్రవీణ్, పాత వాషర్‌మెన్‌పేట అప్పాస్వామి కాలని 3వ వీధికి చెందిన తేజష్, మనలి సర్ సీవీ రామన్ వీధికి చెందిన ఫాతిమా మౌబియాలను అరెస్ట్ చేశారు.

కృష్ణస్వామి సహా 500 మంది అరెస్టు

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని, టీ ఎస్టేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఇలా మొత్తం ఆరు డిమాండ్లతో ఆందోళనకు దిగిన పుదియ తమిళగం కట్చి అధ్యక్షుడు డాక్టర్ కృష్ణస్వామి సహా 500 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అరుంధతీయ వర్గంలో అంతర్గత రిజర్వేషన్లు రద్దు చేయాలని, టీ ఎస్టేట్ కార్మికులకు ఎస్టేట్‌లోనే శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని ఇలా మొత్తం ఆరు ప్రధాన డిమాండ్లతో ఆయన ఆందోళన ర్యాలీకి తలపెట్టారు. ర్యాలీకి తొలుత అనుమతి ఇచ్చిన పోలీసులు బుధవారం రాత్రి రద్దు చేశారు. దీంతో గురువారం ఉదయం కృష్ణస్వామితో పాటు ఆయన పార్టీకి చెందిన కార్యకర్తలు అనేక మంది ఎగ్మోర్‌లోని రాజారత్నం స్టేడియం వద్దకు చేరుకున్నారు. వీరిని అదుపు చేసేందుకు సుమారు 2 వేల మంది పోలీసులను అక్కడ మొహరించారు. అయితే, కృష్ణస్వామి తలపెట్టిన ర్యాలీకి అనుమతి లేకపోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు కృష్ణస్వామితో పాటు దాదాపు 500 మందిని అరెస్టు చేసి చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో కల్చరల్ ఫెస్ట్

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి డివిజన్ స్థాయి కళా ప్రదర్శనలు బుధవారం కోలాహలంగా జరిగాయి. కాట్పాడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి డివిజన్‌లోని ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలలకు చెందిన 9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. 'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత' అనే అంశంపై పాటలు, గ్రూప్ డాన్స్, సోలో డాన్స్, డ్రాయింగ్ సహా పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతీశ్వరపిళ్లై అధ్యక్షత వహించగా, కాట్పాడి డివిజన్ సూపర్‌వైజర్ చాముండేశ్వరి పోటీలు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు సరస్వతి, సీతాలక్ష్మి, కేశవన్, శంకర్, సింగారవేలన్, టెక్నికల్ విద్య ఉపాధ్యాయుడు, కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం అవై అధ్యక్షుడు జనార్ధనన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు



'కంగువా' త్రీడీ ట్రైలర్ రిలీజ్ వేడుకలో చిత్ర బృందం

నిప్పులాంటి మూవీ 'కంగువా'

● హీరో సూర్య

సిరుత్తై శివ దర్శకత్వంలో తాను హీరోగా నటించిన 'కంగువా' చిత్రం నిప్పులా ఉంటుందనే విషయాన్ని గట్టిగా చెబుతున్నట్టు హీరో సూర్య అన్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను త్రీడీ ఫార్మెట్‌లో గురువారం నగరంలో రిలీజ్ చేశారు. ఇందులో దర్శకుడు శివ, నిర్మాత జ్ఞానవేల్ రాజా, కెమెరామెన్ వెట్రి, హీరో సూర్య తదితరులు పాల్గొన్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి సంగీతం దేవీశ్రీ ప్రసాద్. హీరో సూర్య మాట్లాడుతూ, 'నిర్మాత జ్ఞానవేల్ రాజా అనే వ్యక్తి లేకుంటే ఇలాంటి సినిమా వచ్చేది కాదు. దాదాపు 170 రోజుల పాటు షూటింగ్ చేయగా, ప్రతి రోజూ ఎంతో ఆనందంగా గడిచిపోయేది. కెమెరామెన్ వెట్రి తన పనితనంతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్ళారు. ఈ సినిమాను చూసిన బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ ఇందులోని కొన్ని సీన్లు ఎలా చిత్రీకరించారంటూ ఆశ్చర్యంగా అడిగారు. ఇప్పటివరకు ఇలాంటి థియేటర్ ఎక్స్‌పీరియన్స్ చూసివుండరు. 700యేళ్ళకు ముందు నాటి కథ. కేవలం యాక్షన్ ఫిల్మ్ మాత్రమే కాదు. ప్రతి ఒక్కరిలో ఉండే అహం, క్షమ గుణాలను వివరిస్తుంది. ఒక వ్యక్తి కష్టించి పనిచేస్తే ప్రతిఫలం లభిస్తుందంటారు. అలాంటిది 3 వేల మంది రేయింబవళ్ళు ఈ ప్రాజెక్టు కోసం శ్రమించారు. అందుకే చెబుతున్నాను. చిత్రం నిప్పులా ఉంటుంది. ప్రేక్షకుడు చిత్రాన్ని ఆమితాసక్తితో వీక్షిస్తాడు. తమిళ సినిమాలోనే ఇలాంటి సినిమా తీయగలరనే నొక్కి చెప్పే మూవీగా ఉంటుంది. నవంబరు 14న మరో దీపావళి పండుగ జరుపుకుందాం' అని పేర్కొన్నారు. దర్శకుడు సిరుత్తై శివ మాట్లాడుతూ, 'అభిమానులు ఏం కోరుకుంటున్నారో తదనుగుణంగా సినిమా ఉండాలని పరితపించే నటుడు సూర్య. నిర్మాత జ్ఞానవేల్ రాజా ఇచ్చిన ధైర్యం, పట్టుదల వల్లే ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశాం. సినిమా విడుదలైన తర్వాత మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటారు' అని పేర్కొన్నారు.

'లిటిల్ సూపర్‌స్టార్' నుంచి 'ఆత్మాన్' వరకు...

చిత్రజ్యోతి

● శింబు సినీ కెరీర్‌కు 40 వసంతాలు



తమిళ చిత్రపరిశ్రమలో బాల నటుడిగా కెరీర్ ప్రారంభించిన సిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు... లిటిల్ సూపర్‌స్టార్ నుంచి ఆత్మాన్ అంటూ ముద్దుగా పిలుచుకునే స్థాయికి ఎదిగారు. ఈ క్రమంలో ఆయన 40 యేళ్ళ సినీ కెరీర్ పూర్తి చేసుకున్నారు. కోలీవుడ్‌కు చెందిన ప్రముఖ దర్శక నిర్మాత, హీరో, సంగీత దర్శకుడు టీఆర్ రాజేందర్ వారసుడిగా సినీ రంగ ప్రవేశం చేసిన శింబు.. తాను నటించిన చిత్రాల ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో పాటు అభిమానులను సొంతం చేసుకున్నారు.నటుడిగానే కాకుండా, గాయకుడుగా, గేయ రచయితగా, కథా రచయితగా, స్క్రీన్ రైటర్‌గా, దర్శకుడిగా, స్వరకర్తగా ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. అయితే, 40 యేళ్ళ కాలంలో శింబు అనేక ఎత్తుపల్లాలను చవిచూశారు. ప్రస్తుతం కోలీవుడ్‌లో మోస్ట్ బ్యాచిలర్ హీరో అయిన శింబు.. 1984లో వచ్చిన 'ఉరవై కథ కిలి' అనే చిత్రం ద్వారా బాల నటుడిగా ఎంట్రీ ఇచారు. ఆ తర్వాత 1989లో వచ్చిన 'సంసార సంగీతం' చిత్రంలో 'ఐ యామ్ ఏ లిటిల్‌స్టార్' అనే డైలాగ్‌తో ప్రేక్షకులకు చేరువయ్యారు. 2002లో 'కాదల్ అళివదిల్లై' చిత్రంలో ప్రధాన పాత్ర పోషించారు. 2003లో శ్రీకాంత్ దేవా స్వరపరిచిన 'అడ్ర అడ్ర ధమ్' అనే పాటకు గేయరచన చేశారు. 2004లో 'మన్మథన్' చిత్రంలో తొలిసారి ద్విపాత్రాభినయం చేశారు. 2006లో 'వల్లవన్' చిత్రానికి దర్శకత్వం వహించి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయేలా చేశారు. శింబు నటించిన చిత్రాల్లో 'మన్మథన్', 'వల్లవన్', 'విన్నైతాండి వరువాయా' వంటి చిత్రాలు ఘన విజయం సాధించడంతోపాటు కమర్షియల్ హిట్ సాధించాయి. ఇలా తమిళ చిత్రపరిశ్రమకు ఎన్నో క్లాసిక్ హిట్‌లను అందించారు. కేవలం తమ ప్రతిభాపాటవాలను మాతృభాష తమిళం వరకే పరిమితం చేయకుండా తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ చిత్రపరిశ్రమలకు కూడా విస్తరించారు. ఆయా భాషల్లోని పలు చిత్రాల్లో నటించారు. నేపథ్యగానం చేశారు. వెండితెర ప్రేక్షకులతో పాటు బుల్లితెర ప్రేక్షకులను సైతం ఆకర్షించారు. బిగ్‌బాస్, రియాలిటీ షోలకు హోస్ట్, న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించారు. ప్రస్తుతం కమల్ హాసన్ హీరోగా తెరకెక్కుతున్న 'థగ్‌లైఫ్'లో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే, ఏజీఎస్ నిర్మాణ సంస్థ రూపొందించే చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. తనను ఒక నటుడిగానే పరిమితం చేసుకోకుండా, అనేక క్రాఫ్ట్‌లో తన ప్రతిభ నిరూపించుకుంటూ పాన్ ఇండియా హీరోగా అవతరించారు.

డిసెంబరు 20న 'కాదలిక్క నేరమిల్లై'

జయం రవి - నిత్యామేనన్ జంటగా నటించిన 'కాదలిక్క నేరమిల్లై' చిత్రాన్ని వచ్చే నెల 20వ తేదీన విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. రెడ్ జెయింట్ మూవీస్ బ్యానరుపై తెరకెక్కిన ఈ చిత్రానికి కృతికా ఉదయనిధి దర్శకత్వం వహించారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం. షూటింగ్ పూర్తి చేసుకుని తుది దశ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ సిమినా రిలీజ్ తేదీ అధికారికంగా ప్రకటించిన మేకర్స్.. త్వరలోనే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించేలా ప్లాన్ చేస్తోంది. కాగా, దీపావళికి జయం రవి నటించిన 'బ్రదర్' చిత్రం విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను నిరాశపరిచడంతో పంపిణీదారులు భారీ నష్టాలను చవిచూసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం.



'కాదలిక్క నేరమిల్లై'లో జయం రవి - నిత్యామేనన్

కమల్ బర్త్‌డే స్పెషల్ 'థగ్ లైఫ్' టీజర్

● 2025 జూన్ 5న రిలీజ్



'థగ్ లైఫ్'లో కమల్ హాసన్

విశ్వనటుడు కమల్ హాసన్ గురువారం తన 70వ పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. దీనిని పురస్కరించుకుని ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్' నుంచి టీజర్ రిలీజ్ చేశారు. దిగ్గజ డైరెక్టర్ మణిరత్నం ఈ చిత్రానికి దర్శకుడు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కమల్‌తో పాటు దుల్కర్ సల్మాన్, శింబు, త్రిష, గౌతం కార్తీక్, ఐశ్వర్య లక్ష్మి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం. కమల్ బర్త్‌డేను పురస్కరించుకుని ఈ సినిమాను వచ్చే యేడాది జూన్ 5వ తేదీన విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఇందుకోసం 44 సెకన్ల నిడివితో కూడిన ఓ టీజర్‌ను కూడా రిలీజ్ చేశారు. కాగా, 'నాయకుడు' తర్వాత అంటే దాదాపు 35 యేళ్ళ తర్వాత కమల్ - మణిరత్నం కాంబోలో ఈ చిత్రం రూపొందుతుంది. ఈ టీజర్‌లో చిత్రం మేకింగ్ ఇట్టే ఆకర్షించేలా ఉంది. సంగీతం, సన్నివేశాల కూర్పు, కెమెరా, స్టంట్ ఇలా ప్రతి అంశం అబ్బురపరిచేలా ఉన్నాయి. ఈ టీజర్‌లో కమల్, శింబు కనిపిస్తుండగా, కమల్ హాసన్ రెండు గెటప్‌లలో కనిపించారు.

ఆధ్యాత్మికం

విల్లుపురంలో గుహాలయం..

అనంతశయనుడి మందిరం

● పల్లవుల పర్వతాలయంలో కొలువైన రంగనాథస్వామి

● భక్తుల కష్టాలు తీర్చే సింగవరపు స్వామి



వరాహస్వామి సన్నిధి

విల్లుపురం జిల్లాలో పల్లవరాజుల కాలంలో నిర్మించిన ఓ గుహాలయంలో శ్రీరంగనాథస్వామి మహోన్నతమైన రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. భారతీయ ప్రాచీన శిల్పకళలను ఎలుగెత్తి చాటేలా ఉన్న ఈ గుహాలయం విల్లుపురం జిల్లాలోని చారిత్రక నగరం సెంజి కోటకు కూతవేటు దూరంలో ఉంది. ఈ ఆలయంలో రంగనాథస్వామివారు ఆదిశేషుడిపై అనంత శయన భంగిమలో దర్శనమిస్తారు. ఈ ఆలయ ప్రాంతాన్ని మునుపు సింగవరంగా పిలిచేవారు. ఆ కారణంగానే ఈ స్వామివారిని సింగవరం శ్రీరంగనాథస్వామిగా పిలుస్తున్నారు. ఈ ఆలయం మొదటి మహేంద్రవర్మ కాలంలో నిర్మించారని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ఈ సింగవరం కొండ మొదట జైన మతానికి కేంద్రంగా ఉండేదని చెబుతారు. అందుకు సాక్ష్యమిచ్చేలా ఇప్పటికీ సింగవరం చుట్టూ అనేక జైన శిలలు, శిల్పాలున్నాయి. సింగవరం దేవాలయంలోని కొప్పెరుంసింగ శాసనం తిరుపండ్రెన్‌కున్దు ఎంపెరుమానే (వరాహకొండపై వెలసిన పెరుమాళ్) ఈ ఆలయంలో కొలువుదీరి ఉన్నారని చాటుతోంది. ఇక ఈ ఆలయంలోని స్వామివారిని దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయని భక్తులు చెబుతుంటారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై

ఆలయ చరిత్ర

పల్లవరాజు మహేంద్రవర్మ తండ్రి సింహవిష్ణు పాలనా సమయంలో సెంజి రాజమహల్‌కు చేరువగా అందమైన ఉద్యానవనం ఉండేది. ఆ ఉద్యానవనం నుంచి రోజూ రాజమహల్‌కు పూలు తీసుకుని వెళ్లేవారు. ఓ రోజు ఆ ఉద్యానవనం నుంచి పూలు రాజమహల్‌కు రాలేదు. రాజు కారణమేమిటని ప్రశ్నించగా ఓ వరాహం ఉద్యానవనంలో చొరబడి పూలను తిని ధ్వంసచేస్తోందని, ఆ వరాహాన్ని పట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదని రాజభటులు చెప్పారు. దీంతో సింహవిష్ణు ఆ వరాహాన్ని పట్టుకునేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. ఓ రోజు వరాహం కోసం ఎదురుచూస్తూ నందవనంలో దాగారు. ఆ వరాహం ఎప్పటివలెనే నందనవనంలో ప్రవేశించి పూలను ఆరగించడానికి సిద్ధమైంది. వెంటనే రాజు దూకి శూలాయుధంతో దానిని సంహరించేందుకు ప్రయత్నించారు. కానీ అది తప్పించుకుని పారిపోవడంతో ఆ రాజు వరాహాన్ని వెంబడించాడు. ఆ వరాహం నందవనాన్ని దాటి ఓ కొండపైకి పరుగెత్తింది. చివరకు కొండపైకి వెళ్ళిన ఆ వరాహం రాజువైపు చూసి మాయమైంది. రాజు కొండ చివరకు వెళ్ళి చూడగా అక్కడ రంగనాథస్వామి తిరుమేని ఉండటం చూసి విస్మపోయారు. తమ నందనవనంలో పూలను ఆరగించింది సామాన్య వరాహం కాదని, ఆ మహావిష్ణువే వరాహరూపంలో వచ్చి తన ఎరుకను ప్రపంచానికి ఎలుగెత్తి చాటేందుకే ఈ లీలా విశేషం జరిపించారని రాజు నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత రాజు సింహవిష్ణు రంగనాథస్వామిని ఆరాధించసాగారు. సింహవిష్ణు కుమారుడు మహేంద్రవర్ముడు ఆ కొండను తొలిచి రంగనాథస్వామివారికి గుహాలయం నిర్మించారు.






కొండపైకి వెళ్లటానికి నిర్మించిన మెట్లమార్గం - అనంత శయన భంగిమలో రంగనాథుడు

ఆలయ వైభవం..

అంతటా పచ్చదనం కలిగిన ఆ కొండదిగువ భక్తులకు ముందుగా ఊంజల్ మండపం దర్శనమిస్తుంది. పర్వతాలయానికి వెళ్లేందుకు మెట్లదారి కూడా ఉంది. అక్కడే పెరుమాళ్‌కు సంబంధించిన శంఖం, చక్రం, నామం, తిరుపాదం, పంచముఖాంజనేయుఇ ఆకారాలున్నాయి. అక్కడ నుంచి వెళ్తే 125 మెట్ల మార్గం ఉంది. ఆ మెట్లపై వెళ్తే ఐదంతస్థుల రాజగోపురం కనిపిస్తుంది. రాజగోపురం దాటి లోపలకు వెళ్తే కొండ తొలిచి నిర్మించిన గుహాలయంలో ఆదిశేషుడిపై అనంత శయనుడైన రంగనాథస్వామివారు దర్శనమిస్తారు. ఆ మూలవిరాట్టు 24 అడుగుల పొడవు కలిగి ఉంది. ఈ విగ్రహం శ్రీరంగంలోని రంగనాథస్వామి, తిరువనంతపురంలోని పద్మనాభస్వామి విగ్రహాలకంటే పెద్దదిగా ఉండటం విశేషం. మూలవిరాట్టు ఉదరం వద్ద బ్రహ్మ, వక్షస్థలంపై లక్ష్మీదేవి, దిగువన భూదేవి, గరుత్మంతుడు, జయవిజయలు, నారదమహర్షి కనిపిస్తారు. ఈ గుహాలయం కుడివైపు రంగనాయకి తాయార్ ప్రత్యేక సన్నిధిలో చతుర్భుజాలతో ఆశీనుడై భక్తులను అనుగ్రహిస్తున్నారు. అదే సన్నిధిలో వెనుకవైపు ఉగ్రరూపంలో దుర్గాదేవి దర్శనమిస్తుంది. ఆ అమ్మవారిని కిటికీ నుంచి భక్తులు దర్శిస్తారు. ఆలయ ఎదురుగా బలిపీఠం, రాతి ధ్వజస్తంభం ఉన్నాయి. కొండపై రాజగోపురం, వరదరాజపెరుమాళ్ సన్నిధి, తాయార్ సన్నిధి, నీటిబుగ్గ, వరాహసన్నిధి ఉన్నాయి. ఆ కొలనుకు ఎదురుగా స్థల వృక్షం జమ్మిచెట్టు ఉంది. ఆ స్థలంలో ఉన్న గరుత్మంతుడి విగ్రహం నవపాషాణంతో తయారు చేసినట్లు చెబుతుంటారు. ఈ గరుత్మంతుడిని పూజిస్తే మానసిక భయాలు తొలగుతాయని, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయాన్ని దర్శించే భక్తుల కష్టాలన్నీ పటాపంచలవుతాయని, ఎన్ని సమస్యలు ఎదురైనా ఆ రంగనాథస్వామి సులువుగా పరిష్కరిస్తారని భక్తులు చెబుతుంటారు.



ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో మార్గశిర మాసంలో వైకుంఠ ఏకాదశి, ఆంగ్ల సంవత్సరాది, చిత్రాపౌర్ణమి రోజున స్వామివారి ఊరేగింపు, వయ్యాసిలో గరుడ సేవ, ఆడి నెలలో పవిత్రోత్సవం, ఆడిపూరంలో ఊంజల్ ఉత్సవం.. పురటాసి శనివారాల్లో తిరుమంజనం, తిరుప్పావాడై ఉత్సవం, తై నెలలో తిరుపతిలో జరిగేలా రథసప్తమి వేడుకలు, కానుంపొంగల్, తై అమావాస్య రోజు పగటిపూట ప్రత్యేక ఉత్సవాలు, పంగుణిలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.



ఇష్టదేవేరులతో శ్రీరంగనాథస్వామి

ఎలా వెళ్ళాలి...?

ఈ ఆలయం సెంజి - మలయనూరు మార్గంలో ఉంది. రాష్ట్రంలోని పలు నగరాల నుంచి సెంజికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. సెంజి బస్టాండుకు 5 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి ఆటోలో వెళ్ళవచ్చు. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు తెరచి భక్తులను దర్శనం కోసం అనుమతిస్తారు.



ప్రవేశగోపురం, రాజగోపురం మధ్య విమాన గోపురాలు

నేడు తిరువణ్ణామలై మహారథం ట్రయల్ రన్



కొత్త రూపు సంతరించుకున్న ఆలయ రథం

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ మహారథం ట్రయల్ రన్ శుక్రవారం ఉదయం ఏడుగంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈ మహారథాన్ని హిందూ దేవాదాయ శాఖ రూ.70 లక్షలతో పునర్నిర్మించింది. డిసెంబర్ 10 కార్తీక మహాదీపోత్సవం సందర్భంగా ఈ రథంపై స్వామివారిని ఊరేగించనున్నారు. ఈ నేపథ్యంలో మరమ్మతు పనులన్నీ ముగియటంతో ఆ రథాన్ని ఆలయం ఎదురుగా ఉన్న రథమండప ప్రాంతంలో ఉంచారు. శుక్రవారం ఉదయం ఏడుగంటలకు ప్రత్యేక పూజలు జరిపిన తర్వాత ఈ అరుణాచలేశ్వర మహా రథాన్ని ఆలయ వీధుల్లో ఊరేగించనున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ సి.జ్యోతి, ట్రస్టు బోర్డు అధ్యక్షుడు ఇరా జీవానందం, సభ్యులు టీవీఎస్ రాజారాం, గోమతి గుణశేఖరన్, సినమ్ పెరుమాళ్, డాక్టర్ మీనాక్షి సుందరం, మేనేజర్ సెంథిల్ తదితరులు ఈ రథం ఊరేగింపు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ రథం ముందస్తు ఊరేగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం ఏడు తర్వాత నాలుగు మాడవీథులలో విద్యుత్ సరఫరాను తాత్కాలింగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చెన్నై నుంచి బ్రూనేకు విమానసేవలు ప్రారంభం



విమానసేవలను ప్రారంభిస్తున్న రాయల్ బ్రూనే ఎయిర్‌లైన్స్ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయల్ బ్రూనే ఎయిర్‌లైన్స్ సంస్థ చెన్నై నుంచి బ్రూనే నగరానికి విమాన సేవలను ప్రారంభించినట్లు ఆ సంస్థ సీఈఓ కెప్టెన్ సబిరిన్ బిన్ హాజ్ అబ్దుల్ హమీద్ తెలిపారు. నగరంలో ఓ స్టార్ హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ కొత్త విమానసేవలను అధికారికంగా ప్రారంభించారు. ఈ విమాన సేవలతో రెండు దేశాల మధ్య పర్యాటక, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు మరింత పటిష్ఠమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ విమానయాన ప్రారంభోత్సవం సందర్భంగా మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ అయిన రాయల్ బ్రూనే సంస్థ ఎయిర్‌బస్ ఏ320 నియో విమానానికి వాటర్ కేనాన్ సెల్యూట్‌తో స్వాగత కార్యక్రమం కూడా నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రూనే రాయబారి దతో పడుక హాజ్ అలైహుద్దీన్ మహమ్మద్ టహా, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంసీసీలో జాతీయ విద్యా సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

వేళచ్చేరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలోని మద్రాసు క్రిస్టియన్ కాలేజీ అసోసియేషన్, చెన్నై క్రైస్టవుడ్ స్కూల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ స్థాయి విద్యా సదస్సు జరుగనుంది. ఈ విషయమై గురువారం కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (సీఐఎస్‌సీఈ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా.జోసఫ్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పాఠ్య ప్రణాళికలో పాఠ్యాంశాలు మరింత నాణ్యతగా అందించే అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నామన్నారు. ఈ సదస్సుకు జాతీయ స్థాయిలో రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో నడుస్తున్న సుమారు వందకు పైగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు. అలాగే, క్రైస్టవుడ్ స్కూల్స్ సీఈవో డా.అల్ఫ్రెడ్ దేవప్రసాద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యా బోధన చేపట్టాలని తమ సంస్థ కోరుకుంటూ, అందుకు తగినట్లుగా విద్యా సంస్థల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థులకు అపోలో షైన్ మెరుగైన వైద్య సేవలు



హెల్త్ బ్రాండ్ అంబాసిడర్‌లుగా ఎంపికైన చిన్నారులతో అపోలోషైన్ ఫౌండేషన్ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అపోలో గ్రూపులో పాఠశాలల విద్యార్థుల్లో ఆరోగ్యంపై, ప్రాథమిక వైద్యంపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ 'అపోలో షైన్ ఫౌండేషన్' సేవలు మరింతగా విస్తరింపజేస్తున్నట్లు ఆ ఫౌండేషన్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఇందిరా జయకుమార్ తెలిపారు. స్థానిక మ్యూజిక్ అకాడమీలో గురువారం ఉదయం జరిగిన ఫౌండేషన్ కార్యక్రమంలో హెల్త్ అంబాసిడర్లుగా వివిధ స్కూళ్లకు చెందిన బాలబాలికలను నియమిస్తూ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అపోలో ఆస్పత్రుల గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి సలహా మేరకు 2015 నుంచి అపోలో షైన్ ఫౌండేషన్ తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ , ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లోని 175 పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అత్యవసర ప్రాథమిక చికిత్సపై, వారి తల్లిదండ్రుల ఆరోగ్యభద్రతపై ప్రత్యేక దృష్టిసారించి వైద్యసేవలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో షైన్ డైరక్టర్ కిషోర్ మనోహర్, అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటాచలం, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ బసవరాజా, చెన్నై అపోలో హాస్పిటల్ సీఈఓ వి. నవీన్ తదితరులు పాల్గొన్నారు.



తిరువేర్కాడులో జరిగిన ఎండీఎంకే నేత వైగో మనవరాలు వానతిరేణు వివాహ రిసెప్షన్‌కు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్. మంత్రి దురైమురుగన్, ఎంపీ కనిమొళి

గిరిజనుల కోసం.. బైక్ అంబులెన్స్‌లు

● రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు



పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సులభమైన రవాణా సదుపాయం లేని కొండప్రాంతాల ప్రజలకు అత్యవసర చికిత్స అందించేందుకు 10 జిల్లాల్లో 25 బైక్ అంబులెన్స్‌ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.60 కోట్లు విడుదల చేసింది. '108' అంబులెన్స్ ఆయా ప్రాంతాలకు తీసుకురావడానికి ఈ బైక్‌లు లింక్ వెహికల్‌గా పనిచేస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, ఇతర ప్రజల అత్యవసర వైద్యసేవల కోసం తొలివిడతగా రూ.1.60 కోట్లతో 25 బైక్ అంబులెన్సులను కొనుగోలు చేయాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. 25 జిల్లాల్లో రవాణా సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతాలు, అంబులెన్స్‌లు వెళ్లలేని ప్రాంతాల్లో అత్యవసర వైద్యసేవలందించేందుకు ఈ బైక్ అంబులెన్స్‌లు పనిచేయనున్నాయి. ఇవి 108 అంబులెన్స్‌లకు లింక్ వాహనాలుగా పనిచేస్తూ, రోగులను వేగంగా ఆసుపత్రులకు తరలించేందుకు దోహదపడనున్నాయి. ప్రస్తుతమున్న 1353 అత్యవసర 108 వాహన సేవలో ఆధునిక వైద్యపరికరాలతో కూడిన ద్విచక్ర వాహన అంబులెన్స్ సేవ చేర్చబడింది. అత్యవసర వైద్య చికిత్సలందించడం, రోగులను సకాలంలో సమీపంలోని ఆస్పత్రులకు తీసుకెళ్లడంలో ఈ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం తెలియజేసింది.



తంజావూరు వా.వు.సి.నగర్‌లో సీఎం ట్రోఫీ పోటీల్లో గెలిచి పతకాలు, బహుమతులందుకున్న విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



గజరాజు చాటున..

గజరాజుకు అటు, ఇటు మావటిలు. ఒకటే జోరు వాన. వానకు తడవకుండా గజరాజుపై కప్పిన వస్త్రాన్ని చాటు చేసుకున్నారు. ఇలా వీరు మంగళవారం శ్రీవారి ఆలయం ముందు గజరాజు పక్కన వస్తుండగా పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

షార్‌కు చేరిన పీఎస్‌ఎల్వీ-సీ 59 సామగ్రి

భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోటలోని సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి డిసెంబరులో ప్రయోగించే పీఎస్‌ఎల్వీ-సీ 59 రాకెట్‌కు సంబంధించిన సామగ్రి గురువారం షార్‌కు చేరింది. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో సామగ్రిని షార్‌కు తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ రాకెట్ ద్వారా రోదసీలోకి పంపే బెల్జియం దేశానికి చెందిన ప్రోబా-3 ఉపగ్రహం రెండు రోజుల క్రిత్రం షార్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లు షార్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబరు 5న షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్‌ఎల్వీ-సీ 59 రాకెట్ ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి





యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విశ్వకర్మ ఆనంద్‌సాయి టీటీడీ పాలకమండలి సభ్యుడయ్యారు. శంషాబాద్ సమీపంలోని రామానుజాచార్యుల ఆశ్రమ రూపకల్పనలోనూ ఆయనది ప్రధాన పాత్ర. నిజానికి ఆయన సినిమా ఆర్ట్ డైరెక్టర్. తొలిప్రేమ సినిమా కోసం ఏకంగా తాజ్‌మహల్‌నే సముద్రపు ఒడ్డున ప్రతిష్ఠించిన నిపుణుడు. యమదొంగ, సైనికుడు, గుడుంబా శంకర్, బాలు, బృందావనం, నాని, బద్రీనాథ్ వంటి వందకు పైగా సినిమాలకు కళాదర్శకుడిగా వ్యవహరించారు. ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన వాస్తుశిల్పి. పవన్ కల్యాణ్‌కి సన్నిహిత మిత్రుడు. తిరుమల రూపురేఖలను తన కళానేత్రంతో దర్శిస్తున్న ఆనంద్‌సాయితో ఆంధ్రజ్యోతి సంభాషణ...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పురా సౌందర్యవనంలా తిరుమల

ఆనందసాయి, టీటీడీ బోర్డు సభ్యుడు

40 ఏళ్ల తర్వాత వచ్చిన విశ్వకర్మను

ఇది పెద్ద బాధ్యత. దేవుడి అనుగ్రహం. స్వామివారే డిప్యూటీసీఎం ద్వారా ఈ అవకాశాన్ని నాకు కల్పించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత టీటీడీ బోర్డులోకి విశ్వకర్మగా వచ్చింది నేనే. మనం చేసేది మనం చేయాలి. మిగతాది దేవుడే చేస్తాడు. నాతో చేయించుకుంటాడు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఇద్దరూ చాలా క్రియేటివ్. వారి ఆధ్వర్యంలో ఒక అత్యద్భుత ఆధ్యాత్మిక వాతావరణం తిరుమలలో సాకారం అవుతుందనే నమ్మకం ఉంది. తిరుమలలో ఇప్పటికే అద్భుతమైన ఆర్కిటెక్చర్ ఉంది. దీంతో పాటు శ్రీవారి ఆలయానికి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.

"నాది సంపాదించి, కుటుంబాన్ని బాగా చూసుకోవాల్సిన వయస్సు. అయినా స్వామి కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పనిచేస్తా. భయంతో, భక్తితో చేసే పని మంచి ఫలితాలనే ఇస్తుంది."

క్యూలైన్‌లలో కళా ప్రదర్శనలు

స్వామి దర్శనానికి 24 గంటలు, ఒక్కోసారి మూడు రోజులు కూడా నిరీక్షిస్తున్న సందర్భాలు ఉన్నాయి. క్యూలైన్లలో ఉండేవారు మానసికంగా ఒత్తిడికి గురవుతారు. దాన్ని తొలగించగలగాలి. క్యూలైన్లలో చిన్న చిన్న ఆడిటోరియంలు నిర్మించాలి. భరతనాట్యం, కూచిపూడి, హరికథలు, వాయిద్య కళాప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. స్వామివారి వైభవం, తిరుమల విశిష్టత, చరిత్ర వంటి అంశాలను యానిమేటెడ్ వీడియోలుగా రూపొందించి చూపించాలి. పిల్లల కోసం ప్రత్యేకంగా కథలు రూపొందించి ప్రదర్శించాలి. నిరీక్షణ సమయాన్ని ఉల్లాసంగా మార్చగలగాలి.

"గతంలో తిరుమల ఆలయం ముందు తొలగించిన వెయికాళ్ల మండపానికి పురాతన చరిత్ర ఉంది. దాన్ని మరొక ప్రదేశంలో ఏర్పాటు చేసి ఉంటే బాగుండేది. ఆ దిశగా కూడా ఆలోచనలు చేస్తాం."

విజయనగర రాజ్యంలా తిరుమల

తిరుమల చాలా పవర్‌ఫుల్ ఎనర్జీ ఉన్న ప్రదేశం. ఇక్కడ మోడరన్ బిల్డింగులు ఎందుకు? పురాతన సంప్రదాయాలను మళ్లీ తీసుకురావాలి. ఆ సౌందర్యం తిరుమలలో కనిపించాలి. తిరుమలకు వచ్చే వారందరికీ గొప్ప ఫీల్ రావాలి. కొండెక్కగానే చెప్పులు వదిలేసేలా ఉండాలి. శ్రీకృష్ణదేవరాయల కాలాన్ని గుర్తుచేసేలా తిరుమలను అభివృద్ధి చేయచ్చు. విజయనగర రాజ్యం గుర్తుకు రావాలి. దేశవ్యాప్తంగా పేరుపొందిన ఆర్కిటెక్చర్లు చాలా మంది ఉన్నారు. వారి సాయం తీసుకోవచ్చు. అలా మారిస్తే రాబోయే తరాలకు మంచి చరిత్ర ఇచ్చినవారమవుతాము. తిరుపతికి మన పిల్లలను తీసుకెళితే మాకు మంచి కల్చర్ వస్తుందనే అభిప్రాయాన్ని భక్తుల్లో తీసుకురావడమనదే నా కల. దర్శనాలు, వసతి, ప్రసాదాలకు క్రియేటివిటీ జతైతే భక్తులకు గొప్ప అనుభూతులు లభిస్తాయి.

నడకదారి తీరు మారాలి

పవన్‌కల్యాణ్‌తో కలిసి తిరుమలకు నడచి వస్తున్నపుడు ఆయన కొన్ని సూచనలు చేశారు. నడకదారిని అభివృద్ధి చేయాలన్నారు. అలిపిరి నుంచి తిరుమల వరకు ఉన్న నడక మార్గంలో కొంత స్టోన్ వర్క్ చేయాలి. ప్రత్యేకంగా కొన్ని మండపాలు, విశ్రాంతి సముదాయాలు ఉండాలి. ముఖ్యంగా గ్రీనరీని పెంచాలి. అలిపిరి దారిలో నడుస్తూ ఉంటే ఫారెస్ట్ ఫీల్ రావడం లేదు. కొంత ఆర్టిఫిషియల్ పార్క్‌ను క్రియేట్ చేయాలి. ఈ మార్గంలో ఉన్న అతిపురాతన కట్టడాలు, గోపురాలను సంరక్షించుకోవాలి.

"యాదాద్రి చేసే సమయంలో వచ్చినంత సపోర్ట్ తిరుమల అంజనాద్రికి రాలేదు. ఇక్కడ సిస్టమ్ చూసి భయపడి వెళ్లిపోయా. తిరుమలలో ఏం చేయలేకపోయాననే చాలా కాలం బాధపడ్డాను. టీటీడీ ఇంజినీరింగ్ విభాగాన్ని చాలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముంది."



మన్నారుపోలూరు వద్ద సబ్ స్టేషన్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నెలవల, జేసీ, ఆర్డీవో తదితరులు

జిల్లాకు రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లు

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- తూకివాకం, మాంబట్టులో నిర్మాణం

తిరుపతి కలెక్టరేట్/సూళ్లూరుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం తూకివాకం, తడ మండలం మాంబట్టులో రెండు 133 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. గుంటూరు జిల్లా నుంచి సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తూకివాకానికి సంబంధించి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, సదరన్ డిస్కం సీఎండీ సంతోష్ రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ కరుణాకర్, ఎస్ఈ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు. తూకివాకం వద్ద 133 కేవీ విద్యుత్తు స్టేషన్ ఏర్పాటుతో తిరుపతి అర్బన్, రూరల్, రేణిగుంట మండలాల్లోని 50 వేల మంది వినియోగదారులు లబ్ధి పొందనున్నారని కలెక్టరు తెలిపారు. తిరుపతి ప్రాంతంలో గృహ, వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తూకివాకం జడ్పీటీసీ సుబ్రహ్మణ్యం రెడ్డి, సర్పంచ్ శివ, ట్రాన్స్‌కో ఈఈలు శ్రీనివాస్, సురేంద్ర నాయుడు, డీఈలు, ఏడీఈలు తదతరులు పాల్గొన్నారు.

● సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం తడ మండలం మాంబట్టులో నిర్మాణం చేపట్టనున్న 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు వర్చువల్ పద్ధతిలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.43.53 కోట్లతో మాంబట్టు పారిశ్రామిక వాడలో 5 ఎకరాల విస్తీర్ణంలో ఈ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశాక జేసీ శుభం బన్సాల్ చేతుల మీదుగా మన్నారుపోలూరులో శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, ట్రాన్స్‌కో ఎస్ఈ శేషా రెడ్డి, ఈఈ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, మాధవనాయుడు, తడ ఎంపీపీ రఘురెడ్డి, డీఈ బలరామ్మూర్తి, ఏడీఏ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

20.8 కిలోల గంజాయి స్వాధీనం..నలుగురి అరెస్టు

తడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టుచేశారు. డీఎస్పీ చెంచుబాబు మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. గురువారం శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు వెంటనే అక్కడికి చేరుకుని వారిని విచారించారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 20.8కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అంతర్‌రాష్ట్ర స్మగ్లర్లుగా గుర్తించారు. శ్రీకాకుళం నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తేలింది. నిందితులు తమిళనాడు రాష్ట్రం మధురాంతకానికి చెందిన దేవరాజ్ అలియాస్ దేవ, నరేష్ అలియాస్ రాకేష్, తిరువళ్లూరు జిల్లా కామరాజపురానికి చెందిన హరిహరన్ మార్షన్ అలియాస్ హరి, బెంగళూరు కేఆర్‌పురానికి చెందిన నారాయణగా గుర్తించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, ఇతర సిబ్బందిని అభినందించారు. అలాగే వారం రోజుల క్రితం 48 కేజీల గంజాయి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని ఈ రెండు కేసుల్లో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డు కోసం ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు వెల్లడించారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

గల్లా ఇంటికి టీటీడీ చైర్మన్



తిరుపతి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం అమరరాజ కంపెనీ వద్దగల మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఇంటికి వెళ్లారు. అరుణకుమారితో పాటు అమరరాజ గ్రూప్స్ అధినేతలు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా జయదేవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం టీటీడీ చైర్మన్‌ను గల్లా కుటుంబ సభ్యులు సత్కరించారు. ఇటీవల విడుదలైన గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర పుస్తకాన్ని బీఆర్ నాయుడు కొనుగోలు చేశారు. పుస్తకాలు అమ్మడం ద్వారా వచ్చే మొత్తాన్ని పేద విద్యార్థుల చదువు కోసం ఉపయోగించాన్న అరుణకుమారి నిర్ణయాన్ని ఆయన అభినందించారు. అనంతరం టీటీడీ పాలకమండలి సభ్యుడు ఓవీ రమణ నివాసానికి బీఆర్ నాయుడు వెళ్లి మర్యాదపూర్వకంగా పలకరించారు.

పాఠశాలల్లో విధిగా స్కౌట్, గైడ్ యూనిట్స్

విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్



తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్, గైడ్ యూనిట్స్ విధిగా ఏర్పాటు చేస్తామని డీఈఓ కేవీఎస్ కుమార్ అన్నారు. మంగళం జిల్లా పరిషత్ ఉన్నత ట్రెండ్స్ పాఠశాలలో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ 2024-25వ సంవత్సరంలో జిల్లాలో 1,500 పాఠశాలల్లో స్కౌట్ శాఖలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి జిల్లాలో 40పాఠశాలలకు రూ.50వేల చొప్పున సమగ్రశిక్ష ద్వారా నిధులు ఇవ్వడమే కాకుండా ప్రత్యేక కార్యచరణతో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం బేస్‌బాల్ క్యాంపు క్రీడాకారులను అభినందించారు. జిల్లా వయోజన వనరుల కమిషనర్ ఎం.ఎం.రెడ్డి, కార్యదర్శి జయరాం వార్షిక నివేదిక సమర్పించి, ఫ్లాగ్ డే స్టిక్కర్స్‌ను విడుదల చేశారు. నిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు స్కార్ఫ్ అధికారులను సత్కరించారు. మాస్టర్స్ అడ్వాన్స్ కోర్స్ చేసిన వారికి గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌నాయుడు, జయరామయ్య, మునిరత్నం, వెంకటేశు, రామకృష్ణ, వెంకటాద్రి, మురళి, హేమకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

- మూడు రోజుల పాటు సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనల హోరు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు



యువతరంగ్ లోగో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి యువతరంగ్-2024 కార్యక్రమం నిర్వహించనున్నారు. యూనివర్సిటీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని సృజనాత్మక కళలను వెలికి తీసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విజేతలను జాతీయ పోటీలకు తీసుకెళ్లనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు ఆవిష్కరించారు. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. వారికి అవసరమైన రవాణా, భోజనం, వసతి, వేదికలు వంటి సదుపాయాలు సిద్ధం చేసినట్టు తెలిపారు. డ్యాన్స్, మ్యూజిక్, లిటరరీ ఈవెంట్స్, థియేటర్ ఈవెంట్స్, ఫైన్ ఆర్ట్స్ ఇలా ఐదు విభాగాలుగా 27 ఉప అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే 35 కళాశాలలకు చెందిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వరకూ నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు అన్నమయ్య భవన్ నుంచి మెయిన్ బిల్డింగ్, ఓల్డ్ ఎంబీఏ బిల్డింగ్, శ్రీవారి ఆలయం, పరిపాలనా భవనం మీదుగా శ్రీనివాస ఆడిటోరియం దాకా ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవినాయుడు అతిథులుగా పాల్గొంటారన్నారు. అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కల్యాణ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రిన్సిపాళ్లు సుధారాణి (ఆర్ట్స్), రామకృష్ణారెడ్డి (సైన్స్), నరసయ్య (కామర్స్), దామోదర రెడ్డి (ఇంజినీరింగ్), డాక్టర్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆటోడ్రైవర్ అరెస్టు



శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో మునికుమార్ అనే ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి కథనం మేరకు... శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మునికుమార్, అతడి స్నేహితుడు సతీష్‌కుమార్ ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తుంటారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో ఆగ్రహించిన మునికుమార్ కత్తి వెంటపెట్టుకుని ఈనెల 4వ తేదీన ఉదయం 4 సమయంలో సతీష్ కుమార్ ఇంటి వద్దకు వెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన అతడి భార్య కీర్తన, మామ గణేష్‌లను కత్తితో గాయపరిచాడు. వారి ఫిర్యాదు సీఐ గోపి హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ముక్కంటి ఆలయ సమీపంలోని సన్నిధి వీధిలో టూరిస్టు బస్టాండు వద్ద మునికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరా

నాయుడుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.10 లక్షలు టోకరాపెట్టిన సంఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. నాయుడుపేట-మేనకూరులోని నివాసం ఉంటున్న సాయి అనే యువకుడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ కడపకు చెందిన యువకుడు నమ్మబలికాడు. దీంతో ఆ యువకుడికి సాయి రూ.10 లక్షలు ఇచ్చారు. ఉద్యోగం ఇప్పించక పోగా, అతడి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో బధితుడు గురువారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్



- వెంటనే ఈకేవైసీ చేసుకోవాలన్న జేసీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని జేసీ శుభం బన్సల్ చెప్పారు. తన చాంబరులో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు కోసం ఇది వరకే గ్యాస్ కనెక్షన్ కలిగి వుండాలని, ఆధార్, రేషన్ కార్డు తప్పనిసరిగా వుండాలన్నారు. ఈకేవైసీ చేయకుంటే సబ్సిడీ డబ్బులు అకౌంటులో పడవన్నారు. దీనికోసం ఆఖరు తేదీ అంటూ ఏమీ లేదని గ్యాస్ పంపిణీదారులు లబ్దిదారుల ఇళ్ళ వద్దకే వచ్చి ఈకేవైసీ చేసుకుంటారని చెప్పారు. ఎవరూ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం బుక్ చేసుకోవచ్చన్నారు. ఈకేవైసీ పూర్తయిన వారికి వారి అకౌంట్లలో నగదు జమవుతుందని జేసీ పేర్కొన్నారు. వీటిపై సందేహాలుంటే 1967కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు.

జీవీఆర్ పరిశ్రమలపై ఐటీ దాడులు

కోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడులోని జీవీఆర్ (సాగర్‌గ్రంధి ఎక్స్‌పోర్ట్) రొయ్యల పరిశ్రమలో గురువారం ఆదాయపన్నుశాఖ అధికారులు తనిఖీలు చేశారు. సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని ఈ తనిఖీలు చేపట్టారు. ఈ రొయ్యల పరిశ్రమ మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, భీమవరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ది. ఈయనతో పాటు, వారి కుటుంబసభ్యులకు చెందిన 11 పరిశ్రమల్లోనూ ఆదాయ పన్నుశాఖ అధికారులు ఏకకాలంలో సోదాలు చేస్తున్నట్లు సమాచారం.

పుష్పయాగానికి నేడు అంకురార్పణ

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం జరగనున్న పుష్పయాగానికి శుక్రవారం అంకురార్పణ జరుగనుంది. రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య అంకురార్పణ నిర్వహించి ఆచార్య రుత్విక్‌వరణం చేపట్టనున్నారు. శనివారం శ్రీవారి ఉత్సవమూర్తులను ఆలయంలోని సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగాన్ని చేపట్టనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 66,168 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,299 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

ఎస్వీయూకు ప్రపంచ గుర్తింపు

- క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రంలో మొదటి స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్-2025లో 581-600 మధ్య ర్యాంకు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీలన్నింటిలో మొదటి స్థానాన్ని పొందింది. పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, అంతర్జాతీయ సంబంధాలు తదితర అంశాల్లో ప్రమాణాలను పరిశీలించి ఈ గుర్తింపును ప్రకటించారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.